క్లుప్తంగా

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



బస్టాండ్‌లో సుగర్ టెస్ట్‌లు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఏడాది పెద్ద ఎత్తున సేవాకార్యక్రమలు చేపట్టాలని నిర్ణయించినట్లు క్లబ్ ఇంటర్నేషల్ డైరెక్టర్ జయంతి వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం నరసాపురం శాఖ అధ్యక్షుడు నూలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్లబ్ తరపున పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచితంగా సుగర్ టెస్ట్‌లు నిర్వహించారు. అనంతరం ఎంబేరు మానార్ కోవెలలో 1000 లీటర్ల వాటర్‌ట్యాంక్‌లు రెండు బహూకరించారు. పట్టణంలోని వీధుల్లో చెప్పులు కుట్టే కార్మికులకు పనిముట్లు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పోగ్రాం కమిటి చైర్మన్ కొనగళ్ల రామకృష్ణ, కార్యదర్శి కంచర్ల బాబ్జి, ట్రెజరర్ కోట్ల బాలకృష్ణ తదితరులుపాల్గొన్నారు.

వైభవంగా వాసవీ హోమం



పెనుగొండ వాసవీ శాంతి థాంలో వాసవీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన భక్తులు వాసవీధాంలో గోపూజ, అర్చనలు నిర్వహించారు. అనంతరం 102 అడుగులు రుషీ గోత్రమందిరంలోని 92 అడుగుల వాసవీ కన్యకపరమేశ్వరి పంచలోహ విగ్రహాన్ని దర్శించుకుని, మరకత శిల వాసవీ మాతకు అభిషేకంలు నిర్వహించారు. అనంతరం వాసవీ శాంతి ధాం యాగశాలలో వాసవీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీ కోసం) కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని కోరారు.

రేపటి నుంచి మావుళ్లమ్మ సంబరాలు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలో స్టేట్ హైవే రోడ్డు పక్కన ఉన్న శ్రీ మావుళ్లమ్మ ఆలయ 111వ వార్షిక సంబరాలను మంగళవారం, బుధవారం నిర్వహిస్తామని మావుళ్లమ్మ ఉత్సవ కమిటీ, శ్రీ గౌరీ శంకర దేవాంగ యువజన సేవ సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏడాదిన్నర తర్వాత మళ్లీ శంకుస్థాపనా...?



కొమ్ముగూడెంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం బ్రిడ్జి రూ.8.88 కోట్లు, నవాబుపాలెం- వెంకట్రావుపాలెం, వెంకట్రావుపాలెం - త్యాజంపూడి రహదారికి రూ.14.95 కోట్లతో గతంలోనే శంకుస్థాపన చేశారని వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ గుర్తు చేశారు. ఆదివారం మండలంలోని కొమ్ముగూడెంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్ నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ శంకుస్థాపన జరిగిన వాటికి మళ్లీ ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి 2023 నవంబరు 15వ తేదిన పరిపాలన అనుమతి లభించిందని, 2024 మార్చి 6వ తేదిన శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలోని త్యాజంపూడికి అనుసంధానంగా ఈ బ్రిడ్జి ఉండటంతో అప్పటి ఎంపీ మార్గాని భరత్ సహకారంతో ఈ బ్రిడ్జిని మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. అయితే, కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చామని ఎమ్మెల్యే చెబుతున్నారన్నారు. ఈ బ్రిడ్జి నాటిదేనా...? కొత్తగా ఏమైనా మంజూరు చేయించారా ?అని ప్రశ్నించారు. వీరంపాలెం వద్ద బ్రిడ్జి కూలిపోవడానికి నాటి టీడీపీ ప్రభుత్వం కారణమని ఆరోపించారు. కాలువ వ్యాసార్థం పెంచినా బ్రిడ్జి పెంచకపోవడంతో బ్రిడ్జి కూలిపోయిందన్నారు.వైఎస్సార్ సీపీ జిల్లా సమన్వయకర్త ముప్పిడి సంపత్‌కుమార్ వైస్ ఎంపీపీ-2 కట్టా రంగబాబు పాల్గొన్నారు.

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

- జూన్ 30తో గడువు ముగింపు
- ఇప్పటిదాకా కేవలం 186 దరఖాస్తులు



ఏపి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ కార్యాలయం

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ వినియోగంలో అదనపు లోడు వాడుకుంటున్న వినియోగదారులకు ఏపి ఈపీడీసీఎల్ రాయితీ పథకాన్ని అమలుచేస్తుంది. విద్యుత్‌శాఖ ఇచ్చిన విద్యుత్ లోడుకన్నా అదనంగా వాడుకుంటే దాని ప్రభావం ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లపై అధిక భారం పడుతుంటుంది. తద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం గృహోపకరణాల్లో విద్యుత్ పేలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. ఇలాంటి సమస్యను పరిష్కరించడానికి ఏపీ ఈపీడీసీఎల్ వినియోగదారుల కోసం క్రమబద్ధీకరణ రాయితీని అందిస్తుంది. విద్యుత్ అదనపు లోడును స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునే గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీ అందిస్తుంది. ఈ పథకం ఈ సంవత్సరం మార్చి నెల 1 నుంచి అమల్లోకి రాగా ఈ నెల జూన్ 30 తో ముగుస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ వినియోగదార్లు ఇలా..

పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం గృహ వినియోగదారులు కేటగిరి-1లో పాలకొల్లు 23989, పోడూరు 19699, పూలపల్లి 21592, యలమంచిలి 20227 మొత్తం 85487 మంది వినియోగదారులు ఉన్నారు. వీరిలో అధిక లోడు వాడుతున్న గృహ వినియోగదారులు పాలకొల్లు 2559, పోడూరు 2649, పూలపల్లి 2950, యలమంచిలి 2892 ఉన్నారు. అంటే మొత్తం 11050 మంది ఉన్నారు. ఇప్పటి వరకూ ఈ పథకాన్ని వినియోగించుకున్న వినియోగదారులు పాలకొల్లు 68, పోడూరు 45, పూలపల్లి 45, యలమంచిలి 28 మొత్తం 186 మంది మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణతో ఏ ప్రాంతాల్లో ఎంత వరకూ విద్యుత్ సరఫరా చేయాలో పరిశీలించి దానికి అనుగుణంగా పరికరాలను ఏర్పాటు చేసుకుని అదనపు లోడు సమస్యను పరిష్కరించడానికి విద్యుత్ శాఖ అధికారులకు వెసులుబాటు కలుగుతుంది. ఈ పథకం ద్వారా అదనపు లోడు వాడుకునే వినియోగదారులు క్రమబద్ధీకరణ చేసుకుంటే 50 శాతం రాయితీని అందిస్తున్నారు.

రాయితీ విధానం

సాధారణంగా గృహ వినియోగాదురుల ఒక కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ. 2 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ. 200 చెల్లించాల్సి ఉంటుంది. అదే ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారులు కల్పిస్తున్న ఈ పథకం ద్వారా స్వచ్ఛందంగా క్రమబద్ధీకరణ చేయించుకుంటే సెక్యూరిటీ డిపాజిట్‌తో పాటు ధరఖాస్తు ఫీజు గా రూ.50లతో కలిపి రూ. 1250 చెల్లిస్తే సరిపోతుంది. ఇలాంటి సదావకాశం కల్పించినా గాని 11050 మంది అధనపు లోడు వినియోగదారుల్లో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారి సంఖ్య 186 మాత్రమే. గత మూడు నెలలుగా వినియోగదారులకు సమాచారం అందిస్తున్నా గాని స్పందన లేకపోవడం గమనార్హం.

రాయితీ విధానం ఇలా..

అదనపు లోడు నిమిత్తం ఇప్పటి వరకూ వసూళ్లు చేస్తున్న చార్జీలు ఒక కిలో వాట్‌కు రూ. 2250, రెండు కిలో వాట్లు రూ. 4450, మూడు కిలోవాట్లు రూ. 6650, నాలుగు కిలో వాట్లు రూ. 8850, ఐదు కిలో వాట్లు రూ. 11,050 వసూళ్లు చేస్తున్నారు. ఏపీఈపీడీసీఎల్ అందిస్తున్న రాయితీతో ప్రస్తుతం చార్జీలు ఒక కిలో వాట్‌కు రూ. 1250, రెండు కిలోవాట్లు రూ. 2150, మూడు కిలోవాట్లు రూ. 3650, నాలుగు కిలో వాట్లు రూ. 4850, ఐది కిలో వాట్లు రూ. 6050లు వరకూ వసూళ్లు చేస్తున్నారు. అదనపు విద్యుత్ లోడు గృహ వినియోగదారులు ఈ సదావకాశాన్ని జూన్ నెల 30లోపు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వినియోగదారులకు ఉపయుక్తం



అదనంగా విద్యుత్ వాడుకునే వినియోగదారులకు రాయితీ ఎంతగానో దోహదపడుతుంది. ముఖ్యంగా అధికారులు తనిఖీలు చేస్తారనే భయం, ఆందోళన ఉండదు. ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడే సమస్య తగ్గుతుంది. తద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుంది. దానివల్ల ఇంటిలో విద్యుత్ వస్తువులకు సమస్య లేకుండా ఉంటుంది. స్వచ్ఛందంగా వచ్చి అదనపు లోడు క్రమబద్ధీకరించుకునే వినియోగదారులు ట్రాన్స్‌కో రెవెన్యూ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో ఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు.

– చిటికెన రామకృష్ణ, డీఈఈ, తూర్పు ప్రాంత విద్యుత్ శాఖ,పాలకొల్లు

నేడు 'యువత పోరు'ను విజయవంతం చేయాలి

పాలకొల్లు సెంట్రల్: నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పించేవరకూ నిరుద్యోగ భృతి రూ. 3 వేలు కల్పిస్తానని ఎన్నికల హామీని ఇప్పటి వరకూ అమలు చేయకపోవడం నిరుద్యోగుల పట్ల చంద్రబాబు నిర్లక్ష్యవైఖరికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆదేశాల ప్రకారం యువతకు మద్దతుగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి శాంతియుత ర్యాలీ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకూ వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని చెప్పారు. కార్యక్రమానికి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ సభ్యులు, యూత్ నాయకులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పోరుబాటను విజయవంతం చేయాలి

యలమంచిలి/నరసాపురం రూరల్: రాష్ట్రంలోని యువతకు మద్దతుగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టనున్న యువత పోరు శాంతియుత నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ వలంటీర్స్ వింగ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలపర్తి సందీప్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగులకు నిండా ముంచిన కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా వైఎస్సార్ సీపీ యువత పోరు నిర్వహిస్తుందని వైఎస్సార్‌సీపీ ఎంబీసీ విభాగం అధ్యక్షుడు పెండ్ర వీరన్న తెలిపారు. యువత పోరులో పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

చేపల వేలంలో కూటమి నాయకుల కుమ్మక్కు



ఏనుగువానిలంక మంచినీటి చెరువు వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



మంచినీటి చెరువులో తేలుతున్న చేపలు

యలమంచిలి: ఏనుగువానిలంక గ్రామంలోని మంచినీటి చెరువులు ఒకరోజు చేపల వేలంలో కూటమి నాయకులు కుమ్మక్కై పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో సుమారు నాలుగు వేల జనాభా ఉన్నారు. వీరికి మంచినీటి అవసరాలు తీర్చడానికి రెండు చెరువులు ఉన్నాయి. ఒకటి ప్రధాన గ్రామంలో గ్రామ దేవతల ఆలయంవద్ద, మరొకటి పోలవరంలో ఉన్నాయి. వేసవి వెళ్లి చెరువులో కొత్తగా నీరు పెడు తున్న నేపథ్యంలో ఈ రెండు చెరువుల్లో చేపలు పట్టడానికి పంచాయతీలో ఒకరోజు వేలం నిర్వహించారు. ఈ వేలంలో కూటమి పార్టీలకు చెందిన ప్రధాన నాయకులంతా ఏకమై పాట ఎక్కువ మొత్తంలో వెళ్లకుండా కుమ్మక్కై రెండు చెరువులను కేవలం రూ.30వేలకు దక్కించుకున్నారని గ్రామ స్తులు ఆరోపిస్తున్నారు. ఈ రెండు చెరువుల్లో ప్రధాన చెరువులో ఆదివారం చేపలు పట్టారు. ఈ చెరువు సుమారు ఆరు ఎకరాలు ఉంటుంది. ఈ చెరువుగట్టున గ్రామ దేవతలు మారెమ్మ, మావూ రమ్మ ఆలయాలు ఉంటాయి. దీంతో గ్రామస్తులంతా అమ్మవార్ల ప్రసాదంగా ఈ చెరువులో చేపలు కొనడానికి ఆసక్తి చూపుతారు. అయితే కుమ్మక్కై పాట దక్కించుకున్న కూటమి నాయకులు ఈ చెరువులో చేపలు పెద్ద మొత్తంలో వారే వాటాలు వేసుకుని తీసేసుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సెంటిమెంటు పేరుతో అధిక ధరలు

మిగిలిన చేపలు కూడా బహిరంగ మార్కెట్‌లో కిలో చేప రూ.150 ఉండగా, అమ్మ వారి సెంటుమెంటు పేరుతో రూ.200 పైబడి అమ్మారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అవి కూడా వారి అనుయాయులకే అమ్మారని, మిగిలినవి మార్కెట్‌కు తరలించారని ఆరోపిస్తున్నారు. ఈ ఒక్క చెరువులోనే సుమారు రూ.1.50 లక్షలు వరకు వచ్చి ఉంటుందని గ్రామస్తులు చెప్పారు. ఒకవైపు పంచాయతీ ఆదాయానికి గండికొట్టి సొమ్ము చేసు కున్న కూటమి నాయకులు మరొకవైపు గ్రామస్తు లకు చేపలు అమ్మకుండా మోసం చేశారని వాపోతున్నారు. పోలవరం చెరువులో కూడా భారీ చేపలు ఉన్నాయని, ఈ వేలం మళ్లీ పెట్టి సొమ్ము కూటమి నాయకుల పరంకాకుండా పంచాయతీకి ఆదాయం తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆదివారం పట్టిన మంచినీటి చెరువులో చనిపోయిన చేపలను బయట వేయకుండా చెరువులోనే ఉంచేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ చెరువుకు నీరు పెడుతున్నారు. చనిపోయిన చేపలు చెరువులో ఉంచి కొత్త నీరు పెడితే అవి కుళ్లిపోయి నీటిలో కలవడం వల్ల ప్రజలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని కనుక అధికారులు స్పందించి చెరువులో చనిపోయిన చేపలను బయటకు తీయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రిటైనింగ్ వాల్ పూడికలో నిర్లక్ష్యం

యలమంచిలి: కాజ పడమర గ్రామ పరిధిలో చీమలకోడు కాల్వకు రిటైనింగ్ వాల్స్ నిర్మించారు. ఈ కాలువ పక్కనే కరెంటు స్తంభాలు ఉండడంతో అవి ఉన్న చోట ఖాళీ వదిలి మిగిలిన ప్రాంతంలో వాల్ నిర్మించారు. వాల్ నిర్మాణం పూర్తి కావడంతో మధ్య ఖాళీని మట్టితో పూడుస్తున్నారు. అయితే కరెంటు స్తంభాలు ఉన్న చోట వాల్ లేకపోవడంతో అక్కడ కాల్వలో సర్వే కర్రలు పాతి వాటికి అడ్డుగా వెదురు తడికలు పెట్టి మట్టి పూడుస్తున్నారు. కానీ మరొకచోట సర్వే కర్రలు, వెదురు తడికలు లేకుండా కోసేసిన కొబ్బరి చెట్లను అడ్డుగా పెట్టి మట్టి పూడుస్తున్నారు. ఇక్కడ రిటైనింగ్ వాల్ ఎత్తు సుమారు ఎనిమిది అడుగులు ఉండగా సగం ఎత్తు మాత్రమే కొబ్బరి బొందులు పెట్టి మట్టి పూడుస్తున్నారు. దీంతో వేసిన మట్టి వేసినట్లు కాల్వలో పడిపోతుంది. కాంట్రాక్టర్ ఈ విధంగా మట్టి పూడ్చి వెళ్లిపోతే రేపు కాలువలో నీరు ముందుకు పారదని గ్రామస్తులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాల్వపై ఆధారపడి సుమారు 300 ఎకరాలు వరి పొలాలు సాగవుతున్నాయి. కాల్వలో మట్టి ఉంటే ఆ రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి వాల్ మధ్య ఖాళీలను సక్రమంగా పూడ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాజ పడమరలో రిటైనింగ్ వాల్ మధ్యలో తడికలు పెట్టి పూడుస్తున్న దృశ్యం



మరోచోట సగం గోడకు అడ్డుగా కొబ్బరి చెట్ల మొదులను వేసి పూడుస్తున్న దృశ్యం

నడకతో ఆరోగ్యం



వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభావతి

భీమవరం: ప్రతిరోజూ నడవడం వల్ల శరీరానికి, మనస్సుకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుందని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం ప్రభావతి అన్నారు. భీమవరం డీఎన్నార్ లైబ్రరీ సెమినార్ హాల్లో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ -201, 3వ క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి, గవర్నర్ (డిస్ట్రిక్ట్ -201) గుంటూరి రామరాజు, పాస్ట్ గవర్నర్స్, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి మాట్లాడుతూ నడకతో అర్యోగం పొందవచ్చనే ఆలోచన సంకల్పంతో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఏర్పాటు అయ్యిందని, లక్షలాది మంది సభ్యులు వాకర్స్ ఇంటర్నేషనల్‌లో ఉన్నారని, జిల్లాల వారీగా గవర్నర్, సభ్యులను ఎన్నుకొని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామని అన్నారు. గవర్నర్ (డిస్ట్రిక్ట్ -201) గుంటూరి రామరాజు మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వాకర్స్ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించి మన జిల్లా ప్రథమ స్థానంలోకి రావడానికి కృషి చేస్తామని అన్నారు. ఈనెల 29వ తేదీన తిరుపతిలో వాకర్స్ ఇంటర్నేషనల్ 163వ కౌన్సిల్ సమావేశం జరుగుతోందని, ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని రామరాజు అన్నారు. వాకర్స్ క్లబ్‌ల ఉన్నతికి అందరూ సహకరించాలని అన్నారు. అనంతరం వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో వి మురళి మోహన్ రావు, వై సత్యనారాయణ, శనగల కృష్ణమూర్తి, ఎస్ సుబ్బారావు, ఎస్ నాగేశ్వరరావు, వడుపు గోపి, బోండా శ్రీరామ్, పాత గవర్నర్ లు నరసింహ మూర్తి, ఇర్రింకిసూర్యారావు, ఆర్. రామకృష్ణ రాజు కటికల పల్లారావు, పి.సీతారామరాజు, గాదిరాజు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి పెద్దిబొట్ల బ్రహ్మయ్య పురస్కారం



పెద్దిబొట్ల బ్రహ్మయ్య పురస్కారం అందుకుంటున్న వీర లక్ష్మీదేవి

పాలకొల్లు సెంట్రల్: రచయిత్రి, సాహిత్య విమర్శకులు డాక్టర్ వాడ్రేవు వీర లక్ష్మీదేవి రచనలు, కథా సంకలనాలు మానవ జీవితంలో ప్రేమని, స్వేచ్ఛాకాంక్షని, మృగ్యమైపోతున్న విలువల్ని బలంగా పట్టి చూపిస్తాయని సాహిత్య వ్యాసాల సమీక్షకుడు డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, కన్యాకుమారి కాన్ఫరెన్స్ హాల్ లయన్స్ క్లబ్‌లో పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక రసధుని సాహితీ పురస్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య విమర్శకులు డాక్టర్ వాడ్రేవు వీర లక్ష్మీదేవికి బ్రహ్మయ్య స్మారక పురస్కారం అందించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ వీర లక్ష్మీదేవి సాహిత్య విమర్శ గ్రంథాల గురించి వివరించారు. అనంతరం రసధుని నూతన కమిటీ అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు, సెక్రటరీ యర్రంశెట్టి వెంకటరత్నం, కమిటీ సభ్యులతో సలహా మండలి సభ్యులు చేగొండి వివి సత్యనారాయణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రసధుని ట్రెజరర్ ముచ్చర్ల సత్యనారాయణ, సభ్యులు వంగా నరసింహరావు, మాడభూషి కృష్ణప్రసాద్, గుత్తికొండ కొండలరావు, చేగొండి రంగారావు, జె.జయ దుర్గారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమ్మె నోటీసు అందజేత

తణుకు అర్బన్: తణుకు మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగంలో అవుట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు సోమవారం నుంచి సమ్మెకు దిగుతున్నట్లుగా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు సమ్మె నోటీసును అందజేసినట్లు తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే తాము సమ్మెకు దిగుతున్నామని ఎమ్మెల్యేకి వివరించినట్లు కార్మిక సంఘ నాయకులు ఉండ్రాజవరపు శ్రీను, గెల్లా విజయ్‌కుమార్, పడాల దానం, దాసరి సత్యనారాయణ తెలిపారు. ముఖ్యమంత్రితో తమ సమస్యలు విన్నవించి తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు వివరించారు.

ఆగిన పేరుపాలెం బీచ్ అభివృద్ధి



మొగల్తూరు మండలంలోని పేరుపాలెం బీచ్‌లో సేదతీరుతున్న పర్యాటకులు (ఫైల్)



గత ప్రభుత్వ హయాంలో పేరుపాలెం బీచ్‌లో నిర్మించిన రిసార్ట్స్

ఏడాది కూటమి పాలనలో ముందుకు సాగని అభివృద్ధి పనులు

నరసాపురం: మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏటా లక్షల్లో వచ్చే సందర్శకులతో రాష్ట్రస్థాయిలో ఈ బీచ్ ఇప్పటికే ప్రత్యేకతను చాటుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీచ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. బీచ్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చే విధంగా ఐదేళ్ల పాటు చర్యలు తీసుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2020లో మొదటిసారి పేరుపాలెం బీచ్‌లో మూడురోజుల పాటు బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించింది. దీంతో ఈ బీచ్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడమే కాకుండా అన్ని జిల్లాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే కూటమి సర్కార్ వచ్చిన 12 నెలల కాలంలో బీచ్ అభివృద్ధిపై కనీస స్థాయిలో కూడా ప్రయత్నించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

బీచ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే బీచ్ అభివృద్ధిపై దృష్టిపెట్టడం విశేషం. 2020 ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం పేరుపాలెంలో బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించింది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరవ్వడంతో బీచ్ ప్రత్యేకత మరింత పెరిగింది. ఆ సమయంలో రోడ్ల నిర్మాణాలు, రిసార్ట్స్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. అలాగే రూ.1 కోటి వ్యయంతో వైఎస్సార్ స్మృతి వనం, మ్యూజియ ఏర్పాటు చేశారు. ఇక ప్రైవేట్ భాగస్వామ్యంతో బీచ్‌లో రూ.40 కోట్లు వ్యయంతో రిసార్ట్స్, హోటల్స్ నిర్మాణాలకు గత ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ ఏడాది కాలంలో ఆ ఫైళ్లు మూలనపడ్డాయి. బీచ్‌కు అనుసంధానంగా రూ.4.50 కోట్లతో రహదారి నిర్మాణాలు గత ప్రభుత్వం పూర్తి చేసింది. ఏడాది కూటమి పాలనలో కొత్తగా చిన్నరోడ్డు కూడా మంజూరు కాలేదు. బీచ్ అభివృద్ధి కుంటిపడడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీచ్ అభివృద్ధిపై దృష్టిపెట్టాలి



ఉమ్మడి జిల్లాలో ప్రధాన పర్యాటక కేంద్రంగా పేరుపాలెంలో బీచ్ ఉండడం మన అదృష్టం. అలాంటి బీచ్ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం దారుణం. పేరుపాలెం బీచ్ అభివృద్ధికి గత ప్రభుత్వంలో మంచి ప్రయత్నం జరిగింది. బీచ్ ఫెస్టివల్ ఘనంగా చేశారు. మంచి మంచి రోడ్లు వేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేరుపాలెం బీచ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– కడలి పెద్దిరాజు, నరసాపురం

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



తుందుర్రు గ్రామంలో వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఆరేటి వీరాస్వామి నాయుడు (పెద్దబ్బు) అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రులో హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం మిత్ర మెడికల్ హాస్పటల్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు చుండూరి సాయిబాబు, డాక్టర్ విక్రాంత్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మురళీ, డాక్టర్ సుమ,డాక్టర్ ప్రశాంత్ నాయుడు, డాక్టర్ మురళీ ఆరేటిలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేశారు. డాక్టర్ ఆరేటి మురళీ మాట్లాడుతూ తన స్వగ్రామం తుందుర్రు అని, గ్రామ ప్రజలకు తన వంతు సాయంగా ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నానన్నారు. అనంతరం డాక్టర్లను గ్రామస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాడేరు సొసైటీ మాజీ ఛైర్మన్ ఆరేటి అబ్బులు, కొట్టు సురేష్, కొట్టు త్రినాథ్, ఎంపీటీసీ ఆరేటి వాసు, జక్కంపూడి బాబ్జి, ఆరేటి చంద్రరావు, చీడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.